# మేధావి!

## టి. కె. రాజగోపాల్

నిరంజనంగారు సగటు తెలుగు ప్రేక్షకుడిని సంపూర్ణంగా అర్థం చేసుకున్న మేధావి. అందుకే మేటి తారాగణంతో ఈస్ట్‌మన్ కలర్‌లో 'దీపావళి బుల్లెమ్మ' అనే చిత్రాన్ని నిర్మించి ఆంధ్రదేశం పైకి వదిలేశారు! ఆ చిత్రానికి కథ అంటూ ప్రత్యేకంగా ఏమీ లేదు. డ్యూయెట్లూ, ఛేజ్ సీన్లూ, క్లబ్బు సీన్లూ ( అందులో ప్రసిద్ధి పొందిన డాన్సర్ డాన్సు ఉందని వేరేగా చెప్పాలా! ), ఫైట్ సీన్‌లూ, అపార్థం చేసుకునే ఘట్టాలూ, నాయిక కన్నీరు మున్నీరుగా విలపించే సీన్లూ ( ఇది ఆడవాళ్ళ నెట్టే ఆకట్టుకుంటుంది! ), త్యాగాలు చేయడమే తమ జీవిత లక్ష్యంగా పెట్టుకుని నాయికా నాయకులు త్యాగాలు చేసే ఘట్టాలూ, అశ్లీల సంభాషణలూ, ద్వంద్వార్థం పాటలూ వగైరా వగైరా అన్నీ పుష్కలంగా దట్టించి ఉన్న ఆ చిత్రరాజం ఆంధ్ర ప్రేక్షకుల హృదయాలను అవలీలగా దోచుకుని, పది సెంటర్లలో శతదినోత్సవం జరుపుకుని, నాలుగు థియేటర్లలో రజతోత్సవం కూడా జరుపుకుని నిరంజనంగారికి బోలెడు డబ్బు సంపాదించి పెట్టింది.

ఆ చిత్రానికి వచ్చిన లాభంలో కొంత ఖర్చుపెట్టి ఒకే సారి రెండు ప్రయోగాత్మక చిత్రాలను — ఒకటి పౌరాణికం, మరొకటి క్రైమ్ థ్రిల్లర్ — నిర్మించ నిశ్చయించుకుని, "ఆ రెండు చిత్రాలలో నటించేందుకు నూతన నటీనటులు కావాలి" అని వివిధ ప్రముఖ తెలుగు పత్రికలలో ప్రకటించారు నిరంజనం గారు. అంతేకాదు, ఆ రెండు చిత్రాల కథలను, పాటలను కూడా క్రొత్తవారి చేతే వ్రాయించదలిచారనీ, క్రొత్త ప్లే బాక్ సింగర్‌ను కూడా తెలుగు ప్రేక్షకులకు పరిచయం చేయదలిచారనీ కూడా ప్రకటించారు.

ఇదంతా చూసి నే నాట్టే ఆశ్చర్య పడలేదు గానీ, తను నూతన సినీ కవిని ఎన్నుకోవడానికి జరపదలచిన ఇంటర్‌వ్యూకు నన్ను జడ్జీగా వ్యవహరించ వలసిందని నిరంజనం గారే స్వయంగా కోరి, అతి ప్రయాసతో నా చేత 'సరే' ననిపించుకుని, అందుకు ప్రతిఫలంగా నేను వద్దంటున్నా వినిపించుకోక బలవంతంగా ఒక వెయ్యి రూపాయల చెక్కును నా చేతిలో కుక్కి వెళ్లడం నా కమితమైన ఆశ్చర్యాన్ని కలిగించింది!

'ఇందులో ఆశ్చర్యపడడాని కేముంది? మీరొక సుప్రసిద్ధ జర్నలిస్టు గదా! అందుకే ఆయ నంతగా అర్థించాడు. ఎంతైనా ప్రఖ్యాత విలేఖరి శ్రీనాథ్ గారు ఎన్నిక చేసిన సినీ కవి ఫలానా చిత్రానికి పాటలు వ్రాశాడు అంటే ఆ చిత్రానికదో రకమైన పబ్లిసిటీ వస్తుంది కదా!' అని మీ రనవచ్చు.

భలే వారేనండి మీరు!

తను నిర్మించిన ఆ 'దీపావళి బుల్లెమ్మ' చిత్రం గురించి నిష్పక్షపాతంగా, నిర్మొహమాటంగా నా అభిప్రాయాన్ని తెలుపవలసిందని నిరంజనం గారు కోరినప్పుడు, నేనా చిత్రం గురించి నా నిజమైన అభిప్రాయం చెప్పేసరికి, చిన్నబోయిన ముఖంతో నన్ను చుర చురా చూస్తూ, విసవిసా బయటికి నడిచిపోయి, ఆ తరవాత నే నెక్కడ కనిపించినా మొహం మాడ్చుకుని ఎటో చూసే ఆ నిరంజనంగారే ఈ రోజు హఠాత్తుగా మొహం నిండా చిరునవ్వు పులుముకుని నన్ను ఆ సినీ కవి నెన్నుకునేందుకు రమ్మని పిలిస్తే నే నాశ్చర్య పోనూ? !

• • •

ఇంటర్‌వ్యూ కొచ్చిన అభ్యర్థులు కొన్ని వందల సంఖ్యలో ఉంటారేమో నను కున్న నాకు ఆశాభంగమైంది! కేవలం పదహారు మంది మాత్రమే వచ్చారు.

"ఇంతమందేనా లేక ఇంకా వచ్చేవా రున్నారాండి ..." అని నేను నిరంజనం గారిని అడిగేసరికి, "జనంలో సినీతారలు కావాలన్న వెర్రే ఉంది కాని, సినీ కవులు కావాలన్న వెర్రి ఇంకా పుట్టలేదేమో నండి. మన మింకో వారం రోజులు గడువిచ్చినా ఇంకొక్క అభ్యర్థి కూడా రాడని గారంటీ ఇవ్వగలను ..." అంటూ ఆయన 'జోకే'సేసరికి 13 వ నంబరు అభ్యర్థి తప్ప మిగతా వారంతా పక్కిక నవ్వేసి మనిపించరున్నారు. అప్పుడా 13 వ నంబరు అభ్యర్థి లేచి, "అలా ఇంకో వారం గడువిస్తే ఈ పదహారు మంది రావడం కూడా అనుమానమే!" అనేసరికి నిరంజనంగారు అతగాడిని తీక్షణంగా చూశారు. అది గమనించి నేను మందహాసం చేశాను. "మీరిని ఇంటర్‌వ్యూ చేసేవరకు నేను నా ఆఫీసు రూమ్‌లో ఉంటాను. మీ రక్కడికి వచ్చి మీ రెన్నిక చేసిన అభ్యర్థి నంబరు ఇవ్వండి..." అంటూ ఆ హాలు నుండి బయటికి నడిచారు నిరంజనం గారు.

అన్నట్టు మీకు చెప్పడం మరిచి పోయాను. నిరంజనంగారు ఈ ఇంటర్‌వ్యూను క్రొత్త పద్ధతిలో ఏర్పాటు చేశారు. సాధారణమైన ఇంటర్‌వ్యూల లోలా ఒక్కొక్క అభ్యర్థిని లోనికి పిలిచి, కుర్చీపై కూర్చోమని ఆ తర్వాత ప్రశ్నించడం గాక, అందరినీ ఒక విశాలమైన హాలులో కుర్చీలపై కూర్చోమని చెప్పి వారి కందరికి సీరియల్ నంబర్లిచ్చి ( అంటే ఆ పదహారు మందికి ఒకటి నుండి పదహారు నంబర్లు ఇచ్చేరన్న మాట! ), వారిని నా ఇష్టం వచ్చినట్టు ( తరగతిలో లెక్చరర్ విద్యార్థులను ప్రశ్నించే తీరున ) ప్రశ్నించి, నాకు నచ్చిన అభ్యర్థి నంబరును తనకు తెలుపవలసిందని కోరారు నిరంజనం గారు!

నేను ఆ అభ్యర్థుల వయస్సు, విద్య మొదలైన మామూలు విషయాలు ప్రశ్నించి తెలుసుకున్నాక, హఠాత్తుగా "'దీపావళి బుల్లెమ్మ' గురించి మీ అభిప్రాయ మేమి?" అని అడిగాను. దానితో ఒకరి తరవాత ఒకరు, ఒకరిని మించి మరొకరు ఆ చిత్రాన్ని ఆకాశాని కెత్తేస్తూ మాట్లాడారు! ఆ 13 వ నంబరు అభ్యర్థి మాత్రం దానిని తీవ్రంగా విమర్శించి, "అలాంటి 'సి' క్లాస్ చిత్రాన్ని అందరూ ఎలా మెచ్చుకో గలిగారా అని నేను ఆశ్చర్య పడుతున్నాను" అనడం విని మిగతా అభ్యర్థులంతా అతణ్ణి వింతగా చూశారు. నిజం చెప్పద్దూ. నే నతగాడి మాటల కెంతో ఇంప్రెస్సయ్యాను! నే నడిగిన ఇతర ప్రశ్నలక్కూడా మిగతా అభ్యర్థులు చెప్పిన సమాధానాల కన్నా ఆ 13 వ నంబరు అభ్యర్థి చెప్పిన సమాధానాలే నాకు బాగా నచ్చాయి.

ఉదాహరణకు:— "మీ రెందుకు సినీ కవులు కాదల్చుకున్నారు?" అన్న నా ప్రశ్నకు మిగతా వారంతా, "నాకు పాటలు వ్రాయడం బాగా వచ్చు ... ఇంతవరకు నేను ఫలానా ఫలానా పాటలు

---

**చదువుకూ, తెలివితేటలకూ ఎక్కడా అందికా పొందికా లేదు. ఇంకా చెప్పాలంటే డబ్బు అవసరమైతే అక్షరాలు నేర్పుతుంది; డిగ్రీలు సంపాదించి పెడుతుంది. యుక్తి, చాకచక్యం జయపతాక ఎత్తుతున్నప్పుడు ఏవిమాత్రం ఏం పనికివస్తాయి?**

వ్రాశాను ... ఫలానా గేయ పుస్తకం నేను వ్రాసిందే... రేడియోలో నా గీతాలెన్నో ప్రసార మయ్యాయి... నా స్నేహితులు బలవంతపెట్టారు... నే నీ విధంగా కళామతల్లికి సేవ చేయదల్చాను" అన్న ధోరణిలో చెప్పారు.

ఆ 13వ నంబరు అభ్యర్థి మాత్రం, "అన్ని పనుల కన్నా సినిమాకు పాటలు వ్రాయడ మెంతో సులభం! వచన కవితలు వ్రాసేవారైనా ఈ పంక్తి తరవాతి పంక్తిని ఎలా ప్రారంభించాలి అని ఆలోచిస్తారేమో గాని, సినీ కవికి మాత్రం ఆమాత్రం ఆలోచన కూడా అక్కర్లేదు. చేతికొచ్చిన బూతుపదాలన్నీ వరసగా వ్రాసుకుంటూపోతే అందులోంచి ఎన్ని సినిమా పాటలైనా ఇట్టే తయారై పోతాయి! నా కెన్నో బూతుమాటలు వచ్చును గాబట్టి, నే నీ సినీ కవి పోస్టుకు అప్లై చేశాను ..." అని నిస్సంకోచంగా చెప్పేసరికి మిగతా అభ్యర్థులంతా తెల్లబోయి అతగాడిని చూశారు.

• • •

ఆ 13 వ నంబరు అభ్యర్థినే నే నెన్నిక చేసినట్టు నిరంజనంగారికి చెప్పానని మీరంతా ఈపాటికి ఊహించే ఉంటారనుకుంటాను. ఆ తరవాత ఆ 13 వ నంబరు అభ్యర్థి నన్ను కలుసుకుని తన నెన్నుకున్నందుకు కృతజ్ఞతలు చెప్పుకున్నాడని మీలో కొందరైనా ఊహిస్తే మీ ఊహ కరెక్టే! కాని, ఆ తరవాత అతగాడు నాతో ఏమి చెప్పాడో మీలో ఎవ్వరూ ఊహించి ఉండరేమో?!

"ఇంతవరకు మీకు ఒక విషయం చెప్పనేలేదు, సార్! నాకు సరిగ్గా చదువబ్బడం లేదని మా నాన్న గొంటెడితే ఈ నిరంజనం బాబాయిగారే, 'ఫర్వాలేదులే! వీడి నెలాగో సినీ ఫీల్డులో పైకి తీసుకొస్తాలే' అని మా నాన్నకు ధైర్యం చెప్పి, ఏదో పేరుకిలాంటి ఇంటర్వ్యూ నేర్పాటు చేసి, 'మీరు జడ్జీగా వస్తారనీ, తమగొప్పతనం చూపిన ఆ 'దీపావళి బుల్లెమ్మ' చిత్రం గానీ మీ కనులు పడలేదు గాబట్టి సందర్భం వచ్చినప్పుడల్లా తననీ, తన చిత్రాన్ని బాగా తిట్టేయమనీ, పాటలు, మాటలు అన్నీ అశ్లీల పదజాలాలతో నిండి ఉన్నాయనీ, బుల్లెమ్మగా నటించిన తారాదేవి నటనలో కొత్తదనమేదీ లేదని ...' చెప్పమని బాబాయిగారే నాకు బోధించారు! అలాగే చేసిన నన్ను మీరు సెలెక్టు చేశారు..." అని చెప్పేసరికి నా తల తిరిగిపోయింది!

"నే నేవీ నిజంగా పాటలు వ్రాయనక్కర్లేదని, ఓ సుప్రసిద్ధ సినీ కవి చేత పాటలు వ్రాయించి అవి నా పేరుతో చలామణీ చేయిస్తానని కూడా బాబాయి గారు చెప్పారు ..." అంటూ అతగాడు ఏదేదో చెబుతూనే ఉన్నాడు.

"ఔరా! నిరంజనంగారు న న్నెంత చాకచక్యంగా వినియోగించుకున్నారు? 'బంధు జన పక్షపాతి. అందుకే ఇతగాడిని చేరదీశాడు' అన్న లోకుల నిందనుండి ఎంత చక్కగా తప్పించుకున్నారు! ... నిరంజనంగారు నిజంగా మేధావి! ..." అనుకున్నాను! ★

